సాక్షి రంగారెడ్డి

బుధవారం, 8, ఫిబ్రవరి, 2023



డిజైన్ లోపం..
కొత్తూరు వైజంక్షన్‌లో నిర్మిస్తున్న అండర్ పాస్ డిజైన్‌పై ప్రజలు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. 8లో▸



పరిహారం ఇవ్వండి
హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి తగిన పరిహారం ఇవ్వాలని నేతలు, బాధితులు కోరారు. 8లో▸

ఫాజిల్ హుస్సేన్‌కు అవార్డు
సాక్షి, సిటీబ్యూరో: గవా ఉర్దూ పత్రిక ఎడిటర్ ఫాజిల్ హుస్సేన్ పర్వేజ్‌కు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఢిల్లీ)- 2020 ఏడాదికిగాను ఎక్సలెన్స్ ఇన్ జర్నలిజం అవార్డును ప్రకటించింది. 'ఉర్దూ జర్నలిజంలో సేవలందించిన పలువురు పాత్రికేయులపై రాసిన వ్యాసాని కిగాను పురస్కారం దక్కింది. ఈ నెల 28న ఢిల్లీలోని డిప్యూటీ స్పీకర్ హాల్‌లోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో అవార్డును అందుకోనున్నారు.

న్యూస్‌రీల్

వెల్‌డన్ కిడ్స్



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసిన చిన్నారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లికి చెందిన గుండ్ల మనితేజగౌడ్, గుండ్ల అస్మిత.. ఇంటర్నేషనల్ అండర్– 11 కరాటే పోటీలకు ఎంపికయ్యారు. రెండు రోజులుగా వైజాగ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచారు. వీరితో పాటు జయశ్రీ, ధ్రువసాయి, సాత్విక గోల్డ్ మెడల్స్ సాధించారు. మంగళవారం నగరానికి చేరుకున్న చిన్నారులు మర్యాదపూర్వకంగా క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిశారు. దేశ, రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టారని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్, గుండ్ల బాలరాజుగౌడ్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బందారం అనిల్ గౌడ్, కోచ్ రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్పెల్ విజార్డ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పరమేశ్

ఇబ్రహీంపట్నం: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 9వ తరగతి చదువుతున్న ఖీర్జా ప్రథమ స్థానం, శ్రీహరిని ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈనెల 13న వరంగల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పరమేశ్ విజేతలకు మెడల్స్ అందజేసి, గైడ్ టీచర్ శోభారాణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీ, టీచర్స్ శ్రీలత, సుప్రియ, గిరిజ పాల్గొన్నారు.

చెరువులు గల్లంతు!

జిల్లాలోని పలు చెరువులు.. కబ్జా కోరల్లో చిక్కి వెంచర్లుగా రూపాంతరం చెందుతున్నాయి. అభివృద్ధి ముసుగులో సాగుతున్న ఆక్రమణల పర్వం జల వనరులను మింగేస్తోంది. పలుచోట్ల వందలాది ఎకరాల ఎఫ్‌టీఎల్ భూములు, బఫర్ జోన్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో రికార్డులకే పరిమితమవుతున్న చెరువులు క్షేత్రస్థాయిలో గల్లంతవుతున్నాయి.

రికార్డుల్లోనే కనిపిస్తున్న జల వనరులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఆక్రమణల పర్వం
- పట్టించుకోని పరిరక్షణ కమిటీలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



ఇన్ముల్‌నర్వ చెరువులో పారబోసిన బండరాళ్లు

కొత్తూరు: శరవేగంగా విస్తరిస్తున్న జిల్లాలోని హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న గ్రామాలు ఒకప్పుడు గొలుసు కట్టు చెరువులకు పెట్టింది పేరు. కానీ ప్రస్తుతం పెరుగుతున్న అభివృద్ధి, విస్తరణ కారణంగా.. ఇక్కడున్న జలవనరుల పరిరక్షణ ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది. ఓ వైపు హెచ్ఎండీఏ చెరువుల పరిరక్షణ చర్యలు చేపడుతుండగా.. మరోవైపు ఆక్రమణల పరంపర యథేచ్ఛగా కొనసాగుతోంది. కొన్ని చోట్ల ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు చేపడుతుండగా మరికొన్ని చోట్ల అభివృద్ధి పనులకు అడ్డుగా మారుతోందనే సాకుతో చెరువులను మట్టితో పూడ్చేస్తున్నారు. ఈచర్యల కారణంగా హెచ్ఎండీఏ పరిధిలోని పలు చెరువులు ఉనికిని కోల్పోయి.. రికార్డుల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రక్షణ చర్యలు చేపట్టకపోతే పలు చెరువులు మాయమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

నిద్రావస్థలో రక్షణ కమిటీలు

ప్రభుత్వం 2010లో చెరువుల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులను గుర్తించడం.. ప్రతి చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఏర్పాటు చేయడం, ఆక్రమణలు జరగకుండా చూడటం, ఎఫ్‌టీఎల్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను అప్పగించింది. ఈ కమిటీలు నిద్రావస్థలో ఉండటంతో పలు చోట్ల అక్రమార్కులు చెరువులను ధ్వంసం చేస్తున్నారు.



ప్లాట్లలో నిలిచిన నీరు

జిల్లాలో చెరువులు ఇలా..
- జిల్లాలో వంద ఎకరాల విస్తీర్ణం కన్నా ఎక్కువగా ఉన్న చెరువులు 109 ఉన్నాయి. వీటి కింద సుమారు 22 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.
- వంద ఎకరాలలోపు విస్తీర్ణం కలిగిన చెరువులు 1,463 ఉన్నాయి. వీటి కింద 33,411 ఎకరాల ఆయకట్టు ఉంది.
- జిల్లాలో 34 కత్వాలు (వరద నీటిని నిల్వ చేసి వ్యవసాయానికి వినియోగించే కట్టడాలు) ఉండగా వీటి కింద 7 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.
- 57 ప్రైవేట్ చెరువులు, 206 చెక్‌డ్యాంలు, 157 ఊట కుంటలు ఉన్నాయి. వీటి కింద సుమారు 2వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

నిబంధనల ప్రకారం..
- చెరువు ఎఫ్‌టీఎల్(పూర్తిస్థాయి నీటిమట్టం) పట్టా భూముల్లో ఉన్నప్పటికీ అక్కడ ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు, వెంచర్లు ఏర్పాటు చేయొద్దు.
- ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పొలంలో కేవలం వ్యవసాయం మాత్రమే చేయాలి.
- చెరువు విస్తీర్ణం 25 ఎకరాలలోపు ఉంటే ఎఫ్‌టీఎల్ లెవల్‌ను దాటి 9 మీటర్ల వరకు బఫర్‌జోన్‌గా గుర్తిస్తారు. అదే చెరువు విస్తీర్ణం 25 ఎకరాలకు మించి ఉంటే ఎఫ్‌టీఎల్ లెవల్‌ను దాటి 30 మీటర్ల వరకు బఫర్ జోన్‌గా పరిగణిస్తారు.
- బఫర్ జోన్ల పరిధి తర్వాత సంబంధిత శాఖల అనుమతులు ఉంటేనే అక్కడ కట్టడాలు, వెంచర్లకు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది.
- ఒకవేళ చెరువు సమీపంలో వెంచర్లు, ఇతర కట్టడాలు చేపట్టే వారు కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి.
- వారికి ఎన్‌ఓసీ జారీ చేసే సమయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్ తదితర సర్వేలు చేసి నివేదికను సమర్పిస్తారు.

చిన్నబోయిన పెద్దచెరువు!

కొత్తూరు మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామం సర్వే నంబర్ 254లో 10.06 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మాత్రం రెండెకరాలు కూడా లేదు. చెరువు సమీపంలో ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఓ గ్రానైట్ కంపెనీ నిర్వాహకులు, రియల్ వెంచర్ వ్యాపారులు చెరువును బండరాళ్లతో పూడ్చేశారు. ప్రస్తుతం చూస్తే అసలు ఇక్కడ చెరువు ఉందా..? అనే అనుమానం కలుగుతుంది.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఇన్ముల్‌నర్వలోని పెద్ద చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు వివరాలు నివేదిస్తాం. వారి సూచనల ప్రకారం పనులు చేపడుతాం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి కట్టడాలకు అనుమతి ఉండదు. వ్యాపారులు, ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలి.
– రవీందర్, ఇరిగేషన్, ఏఈ, కొత్తూరు



జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నిరుద్యోగులకు అండగా..

హుడాకాంప్లెక్స్: ఉన్నత చదువులు చదువుకుని ఉపాధి లేక.. ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్న వారికి అండగా నిలవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భావించారు. ఇందులో భాగంగా ఈ నెల 11న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా వందలాది కంపెనీలతో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తులు,ఇంటర్వ్యూలు నిర్వహించి, అక్కడికక్కడే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు జారీ చేయనున్నారు. నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

అర్హత ఆధారంగా..

ఇప్పటి వరకు యూనివర్సిటీలు,కాలేజీల్లో మాత్రమే జాబ్ మేళాలు నిర్వహించేవారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అడపాదడపా వీటిని ఏర్పాటు చేస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఎమ్మెల్యే సొంత ఖర్చులతో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు.దేశ విదేశాలకు చెందిన 130 ప్రముఖ కంపెనీలతో చర్చించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టారు. ఏడో తరగతి నుంచి పీజీ, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సులను పూర్తి చేసిన వారికి అర్హతల ఆధారంగా వివిధ విభాగాల్లో జాబ్స్ లభించనున్నాయి. ముఖ్యంగా హెల్త్ కేర్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, కోర్ సర్వీసులు, బీపీఓ, హోటళ్లు, ఎలక్ట్రికల్, ఎంటర్‌టైన్మెంట్, ఐటీ, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో సపోర్టింగ్ స్టాఫ్, అటెండర్,డాటా ఎంట్రీ ఆపరేటర్లు, సిస్టం ఇంజనీర్లు, రిసెప్షనిస్టులు, హెచ్ఆర్ మేనేజర్లు,సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌లు, ఫార్మసిస్టులు, మార్కెటింగ్, శానిటేషన్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు వంటి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికిరూ.15 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం లభించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



నిరుద్యోగులకు అండగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్రంలోనే తొలిసారిగా అతిపెద్ద జాబ్‌మేళా ఏర్పాటు చేయాలని భావించాం. ఇందుకోసం 130 కంపెనీలను ఆహ్వానించాం. ఖాళీలను భర్తీ చేసుకునేందుకు యాజమాన్యాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి. స్టేడియంలో స్టాల్స్ సహా ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాం. అదనపు సమాచారం కోసం హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేశాం.ఫోన్: 72860 08234, 95054 37112, 82477 68371 నంబర్లలో సంప్రదించాలి.
– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎల్బీనగర్

ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ ఫేవరెట్ సిటీ

- మిసెస్ ఇండియా మొదటి రన్నరప్ కిరణ్మయి

సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ వేదికగా నిర్వహించిన మిసెస్ ఇండియా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన కిరణ్మయి మొదటి రన్నరప్‌గా నిలిచిన సందర్భంగా మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె పాల్గొని తన అనుభవాలను పంచుకున్నారు. ఫ్యాషన్ రంగంలో హైదరాబాద్ ఫేవరెట్ సిటీగా అవతరించిందని, దేశవ్యాప్తంగా ఇక్కడి ఫ్యాషన్ ఔత్సాహికులు అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నారని ఆమె చెప్పారు. పెళ్లితోనే మహిళల జీవితం ఆగిపోకుండా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని కిరణ్మయి పేర్కొన్నారు. మిసెస్ ప్లానెట్, మిసెస్ ఆసియా పోటీలకు సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ రీజినల్ డైరెక్టర్ మమతా త్రివేది తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాలను గద్దె దించాలి

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి పిలుపు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని హామీ

మంచాల: అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దె దించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం మంచాల మండల పరిధిలోని చిత్తాపూర్, తిప్పాయిగూడ, తాళ్లపల్లిగూడ గ్రామాల్లో నిర్వహించిన హాత్‌సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రం ఏర్పడక ముందు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ.. ప్రస్తుతం రూ.5లక్షల కోట్ల అప్పుల పాలైందని విమర్శించారు. నిధులు, నీళ్లు, నియామకాలు పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని భావించి కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని, కానీ ఆ వర్గాల ప్రజలకు దిక్కు లేకుండా పోయిందన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో కూడా పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన ఘనత ఈ ప్రాంత పాలకులదేనని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తి వేస్తామని, రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని, అర్హులకు ఇళ్ల మంజూరుతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మల్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాగా, చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు గుండమోని జయమ్మ, మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, ఎంపీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు ఎద్మా నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జయ నందం, మండల కో–ఆప్షన్ సభ్యుడు వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తాపూర్‌లో మాట్లాడుతున్న మల్‌రెడ్డి

డబుల్ డెక్కర్ ఆగయా

నిజాం నాటి బస్సులకు పూర్వ వైభవం

- ఫార్ములా– ఇ ప్రిక్స్ సందర్భంగా ప్రారంభించిన కేటీఆర్
- దశలవారీగా 20 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు
- పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలకు అందుబాటులో

సాక్షి, సిటీబ్యూరో: 'అలనాటి చారిత్రక డబుల్ డెక్కర్ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. హైదరాబాద్ అందాలను ఆస్వాదిస్తూ రెండంతస్తుల బస్సుల్లో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి' అంటూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై స్పందించిన మంత్రి కేటీఆర్ ఆ అందమైన అనుభవాన్ని నగరవాసులకు తిరిగి అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే డబుల్ డెక్కర్ బస్సులను రోడ్డెక్కించనున్నట్లు ఆయన అప్పుడే చెప్పారు. ట్విటర్ వేదికగా స్పందించినట్లుగానే పర్యావరణప్రియమైన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను మంగళవారం ఆయన ప్రారంభించారు. నగరవాసులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను, సందర్శకులను సైతం విశేషంగా ఆకట్టుకొనేవిధంగాఉన్న మూడు డబుల్ డెక్కర్ బస్సులను నానక్‌రాంగూడలోని హెచ్ఎండీఏ అనుబంధ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ కార్యాలయం వద్ద జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఫార్ములా– ఈ ప్రిక్స్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ, హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డబుల్ డెక్కర్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎస్ శాంతికుమారి, చిత్రంలో మంత్రి కేటీఆర్

ఆహ్లాదభరితంగా పర్యాటక విహారం..

ఫార్ములా– ఈ ప్రిక్స్ సందర్భంగా ప్రారంభించిన డబుల్ డెక్కర్ బస్సులు ప్రస్తుతం రేసింగ్ ట్రాక్ పరిధిలోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, పారడైజ్ ,నిజాం కాలేజీ రూట్‌లలో తిరుగుతాయి. మొదటి విడతగా హెచ్ఎండీఏ 6 బస్సులను కొనుగోలు చేయగా ప్రస్తుతం మూడింటిని ప్రవేశపెట్టారు. త్వరలో మరో మూడు బస్సులు రానున్నాయి. దశలవారీగా మొత్తం 20 బస్సులను ప్రవేశపెట్టేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఫార్ములా– ఈ ప్రిక్స్ అనంతరం డబుల్ డెక్కర్ బస్సులను చారిత్రక, వారసత్వ కట్టడాల సర్క్యూట్‌లలో నడుపుతారు. హైదరాబాద్ పర్యాటక స్థలాలను ఈ బస్సుల్లో సందర్శించవచ్చు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు.

ఇదీ నేపథ్యం...

నిజాం కాలంలోనే ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులను ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ 2003 వరకు నడిపింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి జూపార్కు వరకు, అఫ్జల్‌గంజ్ వరకు ఇవి నడిచేవి. సికింద్రాబాద్ నుంచి మెహిదీపట్నం వరకు డబుల్ డెక్కర్‌లు ఉండేవి. నగరవాసులతో పాటు ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆ బస్సులో పయనించేందుకు ఎంతో మక్కువ చూపేవారు. ట్యాంక్‌బండ్ మీదుగా ఇందులో ప్రయాణం చేయడం ఒక గొప్ప అనుభూతి. కాలక్రమంలో బస్సుల నిర్వహణ భారంగా మారడంతో వీటికి కాలం చెల్లింది. ఫ్లైఓవర్‌ల కారణంగా కూడా బస్సులు నడపడం కష్టంగా మారింది. మంత్రి కేటీఆర్ చొరవ మేరకు ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక సామర్థ్యంతో రూపొందించిన ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్‌లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

ప్రత్యేకతలివే..
- డబుల్ డెక్కర్ బస్సులో 65 మంది ప్రయాణికులకు అనువైన సీట్లు.
- ఇవి పూర్తిగా విద్యుత్‌తో నడుస్తాయి. ఒకసారి చార్జింగ్ చేస్తే 150 కి.మీ వరకు ప్రయాణం చేయవచ్చు.
- 2 నుంచి రెండున్నర గంటల్లో పూర్తిగా చార్జింగ్ చేయవచ్చు.
- 9.8 మీటర్ల పొడవు, 4.7 మీటర్ల ఎత్తు ఉన్న ఈ ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ ఖరీదు రూ.2.16 కోట్లు.

దశలవారీగా వసతుల కల్పన

- ప్రజలకు ఇబ్బందులు కలగనీయం
- మంత్రి సబితారెడ్డి
- సరూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుడాకాంప్లెక్స్: నియోజకవర్గంలోని కాలనీల్లో దశలవారీగా వసతులు కల్పిస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని నర్సింహాపురి కాలనీ, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్– 2, జైస్వాల్ కాలనీలలో రూ.1.80 కోట్లతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయమని చెప్పారు. కాలనీ సంక్షేమ సంఘాల సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేస్తామని వివరించారు. అన్నివర్గాలు, ప్రాంతాల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ సహకారంతో మహేశ్వరాన్ని అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెడుతామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తున్న కేసీఆర్ పాలనను ప్రజలందరూ హర్షిస్తున్నారని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో కొనసాగుతున్నాయని తెలిపారు. సరూర్‌నగర్ పాత గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని.. తీగల సాయంతో విద్యుత్ స్తంభానికి కట్టారు. ఇది చూసిన మంత్రి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పనులకు శంకుస్థాపన చేయకుండానే వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవింద్‌శర్మ, బేర బాలకిషన్, మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి, ఇంటూరి అంకిరెడ్డి, సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణయ్య, ఏఈ ప్రశాంతి పాల్గొన్నారు.



సరూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

డిజైన్ లోపం.. ప్రయాణానికి శాపం

- పరిష్కారం చూపని అండర్‌పాస్ నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యానికి రూ.14.7కోట్లు వృథా
- నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు


అండర్‌పాస్ పనుల దుస్థితి

కొత్తూరు: ప్రస్తుతం ఉన్న అధునాతన సాంకేతికతతో అండర్‌పాస్‌లు, వంతెనలు నిర్మించి గజిబిజిగా ఉన్న కూడళ్లలోనూ ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా చేస్తున్నారు. కొత్తూరు వై జంక్షన్‌లో నిర్మిస్తున్న అండర్‌పాస్‌ను పరిశీలిస్తే మాత్రం అధికారులు, ఇంజనీర్లు ఇచ్చిన డిజన్లపై నాయకులు, వాహనదారులు, ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల ఉదాసీనత కారణంగా రూ.14.7కోట్లు వృథా అయ్యాయని ఆరోపిస్తున్నారు. నాలుగేళ్లు గడస్తున్నా నేటికీ పనులు పూర్తికాలేదు.

చిన్నపాటి వర్షానికే నీటి నిల్వ

కొత్తూరు పట్టణం సమీపంలోని జాతీయ రహదారిపైనున్న వై జంక్షన్ కూడలిలో నిర్మిస్తున్న అండర్‌పాస్ డిజైనింగ్‌లోనే లోపాలున్నట్లు అధికార పార్టీతో పాటు స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. అండర్‌పాస్ నిర్మాణంతో సమీపంలోని శివానగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు మూతపడుతోంది. అండర్‌పాస్ కింది నుంచి భారీ వాహనాలు వెళ్లేందుకు రోడ్డు ఇరుకుగా ఉందని వాపోతున్నారు. పెంజర్ల నుంచి కొత్తూరులోకి, కొత్తూరు నుంచి పెంజర్ల రోడ్డులోకి వెళ్లే వాహనాలకు ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు వివరిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే వంతెన కింద 20 ఫీట్లలోతు వరకు నీరు నిల్వ ఉంటుంది. వాహనదారులు ఏ మాత్రం గమనించకున్నా భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి డిమాండ్

వై జంక్షన్‌ను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన అధికారులు ఇక్కడ వంతెన నిర్మించాలని ప్రభుత్వంతో పాటు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నివేదించారు. ఇందులో భాగంగా 2019లో సుమారు రూ.14.7 కోట్లతో పనులు ప్రారంభించారు. కాగా వై జంక్షన్ కూడలిలో ప్రస్తుతం నిర్మిస్తున్న అండర్‌పాస్‌తో ఉపయోగం లేదంటున్నారు. సకాలంలో అధికారులు స్పందించి డిజైనింగ్ మారిస్తే నిధులు వృథా కాకుండా ఉండేవన్నారు. ఇప్పటికైనా అధికారులు అండర్‌పాస్ వంతెనను పరిశీలించి డిజైనింగ్‌ను మార్చడం.. లేదా సాధ్యం కాని పక్షంలో ఫ్లైఓవర్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

మూడు నెలల్లో పూర్తి



అండర్‌పాస్ పనులపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఇటీవల సమీక్ష నిర్వహించారు. మూడు నెలల్లోపు పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు సూచించారు. ముందున్న డిజైన్ ప్రకారం కాకుండా వరద నీటిని ఎత్తిపోసేందుకు సంపును నిర్మించి అందులో 30 హెచ్‌పీ మోటార్లను బిగించనున్నారు.

– ఇబ్రహీం, మేనేజర్, రాయికల్ టోల్‌ప్లాజా

ట్రెండ్ సెట్టర్‌గా సైక్లింగ్ ట్రాక్

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి


సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎంపీ

చేవెళ్ల: కోకాపేట లేఅవుట్‌లో రూ.95కోట్లతో ఓఆర్ఆర్ పక్క నుంచి 4.5 మీటర్ల వెడల్పు 23కి.మీ వరకు సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ పనులను మంగళవారం చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి పరిశీలించారు. నానక్‌రాంగూడ నుంచి టీఎస్‌పీఏ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు ఈ నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఈ విషయాన్ని ఎంపీ తన ట్విట్టర్ లో పోస్ట్ చేస్తూ..ఈ సైక్లింగ్ ట్రాక్ ఇండియా లోనే ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు.


మొఫకంజా కాలేజ్ జట్టు


సిద్దార్థ కాలేజ్ జట్టు ఇబ్రహీంపట్నం


శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

జోరుగా 'సాక్షి' ప్రీమియర్ లీగ్

SPL SAKSHI PREMIER LEAGUE
SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్–4 (ఎస్‌పీఎల్) మంగళవారం జోరుగా సాగాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 65 జట్లు పోటీ పడుతున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1

మొదటి మ్యాచ్‌లో మొఫకంజా కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన వెస్లీ–ఏ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసి ఓటమి పాలైంది. మొఫకంజా క్రీడాకారుడు అఫాన్ 19 బంతుల్లో 64 పరుగులు చేశాడు.

- రెండో మ్యాచ్‌లో ఎస్పీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 2 వికెకేట్లు కోల్పోయి 178 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అశోకా ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 32 పరుగులు చేసి పరాజయం పాలైంది. ఎస్పీ కళాశాల క్రీడాకారుడు ఎడ్వాన్ 29 బంతుల్లో 100 పరుగులు చేశాడు.
- మూడవ మ్యాచ్‌లో హోలి మేరీ–ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన లయోలా డిగ్రీ కాలేజ్ జట్టు 9.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసి విజయం సాధించింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఎల్ఆర్ఐటీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మల్లారెడ్డి ఇంజనీరింగ్–ఏ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసి ఓడిపోయింది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో వేదా డిగ్రీ–ఏ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి ఓడిపోయింది. వేధా జట్టు క్రీడాకారుడు పవన్ 27 బంతుల్లో 56 పరుగులు, గణేశ్ 17 బంతుల్లో 47 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్‌లో శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రగతి డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడవ మ్యాచ్‌లో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో ఆలౌట్‌తో 82 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసి ఓడిపోయింది.
- నాలుగో మ్యాచ్‌లో ఎంఆర్‌ఈసీ–ఎ జట్టు 10 ఓవర్లలో 7 వికేట్లు కోల్పోయి 94 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ ఇందు కాలేజ్–బి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి ఓటమి పాలైంది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఇబ్రహీంపట్నం: ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల బస్సు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఒనివ్ మిథున్‌శ్రీ(30) రోడ్డుపై ఎగిరి పడ్డాడు. బస్సు వెనుక టైర్లు అతని తలపై నుంచి పోవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరక్‌పూర్ జిల్లా బిస్వాపూర్ గ్రామానికి చెందిన మిథున్‌శ్రీగా గుర్తించారు. ప్రైవేట్ పనులు చేస్తూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నివాసముంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ..

శంకర్‌పల్లి: బైక్‌పై నుంచి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పీఎస్ పరిధిలోని పత్తేపురం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పర్వేద గ్రామానికి చెందిన గొల్లగూడ పద్మమ్మ(48) తన కొడుకు రాజ్‌కుమార్ బైక్‌పై సోమవారం సాయంత్రం పని నిమిత్తం శంకర్‌పల్లికి వెళ్లున్నారు. పత్తేపురం వద్ద ఉన్న మెడిక్యూర్ ఆసుపత్రి వద్దకు రాగానే రోడ్డుపై గుంతలు ఉండటంతో కొడుకు రాజ్‌కుమార్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక కూర్చున్న పద్మమ్మ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి కాంటినెంటల్ ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పద్మకు భర్త, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

భవనంపై నుంచి పడి మేస్త్రీ..

భవనంపై నుంచి కిందపడి మేస్త్రీ మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన వికాస్ బారిక్(55) కొంత కాలంగా మండల పరిధిలోని జనవాడ గ్రామంలో కుటుంబ సభ్యులతో ఉంటూ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమవారం చిన్న శంకర్‌పల్లిలో స్లాబ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి క్రింద పడ్డాడు. చికిత్స నిమిత్తం పట్టణ కేంద్రంలోని లలిత ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

భూ పోరాటాలు ఉధృతం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

తుర్కయంజాల్: రాష్ట్ర వ్యాప్తంగా భూ పోరాటాలు ఉధృతం చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూమ్ భవన్‌లో మంగళవారం పార్టీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు ప్రసంగిస్తూ.. నేటికీ భూమి లేని పేదలు ఎందరో ఉన్నారని.. సీపీఐ ఆధ్వర్యంలో భూ పోరాటాలు చేసి వారికి భూములు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, అసైన్డ్, భూదాన భూములను భూ బకాసురులు ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ అధికారులు ఉదాసీనత ప్రదర్శించడం శోచనీయం అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ధరలను పెంచుతూ సామాన్య ప్రజలపై భారం వేస్తోందన్నారు. లౌకికవాదులంతా ఏకమై భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ రైతుల పాలిట శాపంగా మారిందని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని వారికి పట్టాలను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవీంద్రాచారి, రాష్ట్ర సభ్యుడు పర్వతాలు, రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య, నాయకులు ముత్యాలు, యాదిరెడ్డి, కె.చందు, కె.రామస్వామి, సామిడి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

శంకర్‌పల్లి: ఉరేసుకుని ఓ యవకుడు బలవన్మరణం చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన బద్రి జనార్ధన్(22) కనిపించడం లేదని అతని సోదరుడు మహేందర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుండగా మంగళవారం గ్రామ శివారులోని తన పొలం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

బాలిక అదృశ్యం

కడ్తాల్: తల్లితో గొడవ పడిన బాలిక అదృశ్యమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ హరిశంకర్ గౌడ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గురిగళ్ల మనీషా(16) మంగళవారం తల్లి మంజులతో గొడవపడి, ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక మూగ, చెవుడు సమస్యతో బాధపడుతోందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రస్తుత ధర ప్రకారం పరిహారం ఇవ్వండి

పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి


వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి, భీంభరత్ తదితరులు

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అకాడమీ నుంచి వికారాబాద్ జిల్లా మన్నెగూడ వరకు చేపట్టనున్న జాతీయ రహదారి నిర్మాణంలో రోడ్డుకు ఇరువైపులా పట్టాభూములు కోల్పోతున్న రైతులకు భూ పరిహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొయినాబాద్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చేవెళ్ల మండలంలోని మల్కాపూర్, దామరగిద్ద, ఆలూరు, ఖానాపూర్, పూడూరు మండలంలోని చిట్టెంపల్లి, మన్నెగూడ, పూడూరు తదితర గ్రామాల్లో వందలాది మంది రైతుల భూములు రహదారి విస్తరణలో పోతున్నాయన్నారు. 2018లో జీఓ విడుదల చేసినా నేటికీ భూ సేకరణ చేపట్టలేదన్నారు. ప్రస్తుతతం భూ సేకరణ ప్రారంభించారని కేంద్రం ప్రభుత్వం 2013లో ఆమోదించిన భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం అందజేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. వినతిప్రతం ఇచ్చిన వారిలో పామెన భీంభరత్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

జీబీపీఎల్ పోటీలను విజయవంతం చేయండి

గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

కడ్తాల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గోర్ బంజారా ప్రీమియర్ లీగ్(జీబీపీఎల్) పోటీలను విజయవంతం చేయాలని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ అన్నారు. ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎమ్మెల్సీ నారాయణరెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వ సెలవుదినంగా ప్రటకటించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. జీబీపీఎల్ క్రీడా పోటీలకు సహకరిస్తానన్నారు. సేవాలాల్ జయంతిన సెలవుదినంగా ప్రకటించేందుకు సీఎంతో మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో జీబీపీఎల్ నిర్వాహకులు, గిరిజన విద్యార్థి సేవా సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రమావత్ రాథోడ్, రంగనాయక్, వెంకట్‌నాయక్, నాయకులు బొట్టు వెంకట్‌నాయక్, బావోజీ, వీరేశ్ నాయక్ ఉన్నారు.

ఉపాధ్యాయుల మనసు గెలిచిన సీఎం

పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి


చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాచారం: ఉపాధ్యాయుల మనుసు గెలిచిన నేత సీఎం కేసీఆర్ అని పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. పదోన్నతులు, బదిలీల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి, కురిమిద్ద, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల కలిసి తనకు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయిస్తామని, పీఈటీ, పండిట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యాచారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్‌యాదవ్, వివిధ మండలాల నాయకులు రాంభూపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, బోజయ్య, యాదగిరి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.